క్లుప్తంగా

వైభవంగా స్వామివారికి చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: లాలాచెరువు వద్ద గల శ్రీ గోవింద క్షేత్రంలో స్వామి వారి ఉత్సవమూర్తికి పుష్కరఘాట్‌లో చక్రస్నానం ఆచరించారు. స్వామి దర్శనభాగ్యంతో భక్తులు పులకించిపోయారు. గోవిందక్షేత్రం 14వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీ నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం నిత్యవిధి, మహాపూర్ణాహుతి, చక్రస్నానం సాయంత్రం శ్రీపుష్పయోగం, తీర్థగోష్ఠితో వార్షికోత్సవం ముగించారు. సోమవారం అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మట్టిపల్లి రంగప్రసాద్, మట్టపల్లి రామ్‌కుమార్, సురేష్ కుమార్, బలభద్ర వెంకటరాజు, లక్ష్మణ స్వామి, ఆలయ అర్చకులు శ్రీమన్నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

వడివడిగా తొలకరి పనులు

కడియం: వానల రాక ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో తొలకరి వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, మురమండ, కడియపుసావరం, మాధవరాయుడుపాలెం, దుళ్ళ గ్రామాల పరిధిలోని సుమారు ఐదువేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో స్వర్ణ, 1318 రకాల వరిని సాగు చేసేందుకు రైతులు విత్తనాలు సమకూర్చుకున్నారన్నారు. ఇప్పటి వరకు సుమారు పదకొండున్నర హెక్టార్లలో ఆకుమడులు వేశారని వివరించారు. మిగిలిన రైతులు కూడా ఈ వారంలో ఆకుమడులు పూర్తి చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారన్నారు. దమ్ములో పచ్చిరొట్టను కలియదున్నడంతో పాటు, జీవన ఎరువులకు ప్రాధాన్యమివ్వాలని ఏవో ద్వారకాదేవి సూచించారు.

గోరంట్లకు పలువురి అభినందన



బుచ్చియ్యచౌదరికి పూలబొకే అందిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరిని ఆయన నివాసంలో ఆదివారం పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, జనసేన, బీజేపీ నేతలు, న్యాయవాదులు, నియోజకవర్గంలోని ఎన్‌డీఏ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను శాలువా కప్పి పూలబొకేలు ఇచ్చి అభినందించారు.

ఎన్ రెడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ పదవికి రాజీనామా



అంగాడ సత్యప్రియ

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ నూతన పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్‌గా (ఎన్ రెడ్ క్యాప్) పదవికి న్యాయవాది అంగాడ సత్యప్రియ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శికి పంపారు. రాజమండ్రి రూరల్‌కు చెందిన సత్యప్రియ పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్ సీపీలో కొనసాగుతున్నారు. ఆమె సేవలను గుర్తించిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పదవికి ఎంపిక చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆమె పదవికి రాజీనామా చేశారు. తన ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీలోనే, జగన్ వెంట ప్రయాణించనున్నట్టు పేర్కొన్నారు.

సినిమాలు

శ్యామల	: సత్యభామ
సూర్యమినీ	: ముంజ్యా
సూర్యప్యాలెస్	: బ్యాడ్‌బాయ్స్
స్వామి	: భజేవాయువేగం
శివజ్యోతి	: రక్షణ
అనుశ్రీ	: మనమే
రాజా	: బ్యాడ్‌బాయ్స్
ఊర్వశి	: ఆ ఒక్కటీ అడక్కు
రంభ	: లవ్‌మౌళి,ప్రేమించొద్దు
మేనక	: బాక్
అప్సర	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	: గంగంగణేశా
నామవరం	
వీఎస్.మహల్	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, భజేవాయువేగం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కడియం	
వెంకటసూర్య	: మనమే



రకరకాల పూల డెకరేషన్ వస్తువులు



బొమ్మలు



రెడీమేడ్ దుస్తులు

అందరకీ అందుబాటులో..

- అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటున్న సండే బజార్
- ప్రతి ఆదివారం మెయిన్‌రోడ్డు పొడవునా షాపులు
- వివిధ రకాల వస్తువుల అమ్మకం
- సుమారు 300 మంది చిరు వ్యాపారులకు జీవనాధారం



మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన స్టాల్స్



వంటల కోసం ఉపయోగించే వస్తువులు

రాజమహేంద్రవరం సిటీ: సండే బజార్‌లో తక్కువ ధరలకు వస్తువులు లభ్యమవుతుండటంతో నగర ప్రజలు తమకు అవసరమైనవి కొనుగోలు చేసుకొనేందుకు తరలి వస్తున్నారు. నగరంలో మెయిన్‌రోడ్డులో ఆదివారం వచ్చిందంటే చాలు నగర ప్రజలు విశేష సంఖ్యలో వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసేందుకు తరలివస్తున్నారు. సుమారు 300 షాపుల ద్వారా చిరు వ్యాపారులకు ఇది జీవనాధారంగా మారింది. పెద్ద పెద్ద షాపుల్లో దొరికే అన్ని రకాల వస్తువులు తక్కువ ధరకే లభ్యమవుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తరలివస్తున్నారు. సండే బజార్లో నాణ్యమైన వస్తువులు తక్కువ ధరకు దొరకడంతో వాటిని కొనుగోలు చేసేందుకు మక్కువ కనబరుస్తున్నారు. కోటగుమ్మం సెంటర్ నుంచి డీలక్స్ సెంటర్ వరకు రోడ్డుకిరువైపులా చిరు వ్యాపారులు సండే బజార్లో వివిధ రకాల వస్తువులను అమ్మకం సాగించేందుకు ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని రకాల రెడీమేడ్ వస్త్రాలు, మహిళలను ఆకట్టుకునే పంజాబీ డ్రెస్సులు, ఫ్యాన్సీ సామాన్లు, చీరలు, డిజైనర్ బ్లౌజులు, డోరు కర్టెన్లు, వాచీలు, బెల్టులు, జోళ్లు, షూస్, టెడ్డీబేర్స్, రకరకాల పూలకుండీలు, వంటలకు ఉపయోగించే పలు రకాల వస్తువులు, పురుషులకు అవసరమైన ట్రాక్స్, రెడీమేడ్ షర్ట్స్, షార్ట్స్ ,టీషర్ట్స్, ఎలక్ట్రికల్ సామాన్లు ఇలా పలు రకాలు వస్తువులు లభ్యమవుతున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో నగర ప్రజలు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ మార్కెట్లో రెండవ కేటగిరీకి చెందిన వస్త్రాలు, వస్తువులను అమ్మకానికి వ్యాపారులు సిద్ధం చేస్తున్నారు. కొనుగోలుదారుల అభిరుచికి అనుగుణంగా వస్తువులు లభ్యమవుతుండడంతో కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రెడీమేడ్ వస్త్రాలను గుట్టలుగా పోసి అతి తక్కువ ధరకు అమ్ముతున్నారు.

పండగ సమయాల్లో మరింత రద్దీ

సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ ఇత్యాది పండగ సమయాల్లో కొనుగోలు దారుల అభిరుచి మేరకు ఆయా సమయాలలో నగర ప్రజల అవసరాల మేరకు వస్తువులను సిద్ధం చేస్తున్నారు. పండగ రోజుల్లో ఆదివారం వస్తే మెయిన్‌రోడ్డు కొనుగోలు దారులతో కిక్కిరిసిపోతోంది.

తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులు



ప్రజల అవసరాలను గుర్తించి నాణ్యమైన వస్తువులను తక్కువ ధరకు అందిస్తున్నాం. ఆదివారం ఉదయం, సాయంత్రం సమయాల్లో కొనుగోలు దారులు భారీగా తరలివస్తారు. పండగ సమయాల్లో ప్రజల అవసరాలు, అభిరుచి మేరకు వస్తువులను అమ్మకాలకు సిద్ధం చేస్తుంటాం. ప్రజలు బాగా ఆదరిస్తున్నారు. ఒకసారి వచ్చిన కొనుగోలు దారులు మళ్లీ మళ్లీ రావడం చిరు వ్యాపారులకు చేయూతగా ఉంటోంది.

– శ్యాం, చిరు వ్యాపారి, మెయిన్‌రోడ్డు

జీవనోపాధి దొరుకుతోంది



సండే బజార్‌లో చిరు వ్యాపారులకు జీవనోపాధి దొరుకుతోంది. సుమారు 300 మంది చిరువ్యాపారులు వివిధ రకాల వ్యాపారాలు సాగిస్తున్నారు. అన్ని వర్గాల వారికి అవసరమైన వస్తువులు దొరుకుతుండటంతో ప్రజలు వారికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు ఇష్టం చూపిస్తున్నారు. తక్కువ ధరలకు నాణ్యమైన వస్తువులు దొరుకుతుండటంతో గిరాకీ ఏర్పడుతోంది.

– శ్రీను, చిరు వ్యాపారి మెయిన్‌రోడ్డు

అలరించిన కూచిపూడి నృత్యం



నల్లమిల్లి ముత్యాలమ్మ జాతరలో కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

రంగంపేట: మండలంలోని నల్లమిల్లి గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బిక్కవోలుకు చెందిన కూచిపూడి కళాధామం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అందరినీ అలరించాయి. వినాయక శబ్దం, ఆనంద తాడవం, భామనే సత్య భామనే, ప్రహ్లాద పట్టాభిషేకం, దశావతార శబ్దం, భరత వేద మున, బ్రహ్మాంజలి వంటి కీర్తలనకు నాట్యాచారిణి పిల్లి జాహ్నవి ఆధ్వర్యంలో చిన్నారులు నృత్యం చేశారు. అనంతరం చిన్నారులను, జాహ్నవిని ఉత్సవ కమిటీ సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో స్వామివారికి ఆదివారం పంచామృతాభిషేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు స్వామివారికి ఉదయం విశేష, వ్రత పూజలు నిర్వమించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో కుర్చొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా వరసిద్ధి వినాయక వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి లంక గ్రామంలోని మెయిన్‌రోడ్డు వద్ద కొలువై ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ పదవికి సాగర్ రాజీనామా



సాగర్

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ పదవికి రాజమహేంద్రవరం నగరానికి చెందిన కానుబోయిన సాగర్ ఆదివారం రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోవడంతో రాజీనామా లేఖను ఈ మెయిల్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నమెంట్ ఇండస్ట్రీస్ డిపార్టమెంట్, ఏపీఐడీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌లకు పంపించారు. ఈ పదవీ కాలంలో డీఐఈపీసీలో (డిస్టిక్ ఇండస్ట్రీస్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్‌కమిటీ) లో ఏపీఐడీసీ డైరెక్టర్లను నియమించాలని ఆరు నెలలు ఒక జీవో కోసం శ్రమించానన్నారు. గవర్నమెంట్ పరిశీలించి జిల్లా కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించడం మర్చిపోలేని విషయమన్నారు. ఈ కమిటీలో ఉన్నందువల్ల పేద ప్రజలకు లోన్స్ పంపిణీలో న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో శ్రమించానన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



తొర్రేడులో స్వీట్లు పంపిణీ చేస్తున్న యానాపు యేసు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: నరేంద్రమోదీ ప్రధాన మంత్రిగా మూడవసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి తొర్రేడు గ్రామంలో బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. అసెంబ్లీ కో-కన్వీనర్ యానాపు యేసు, బీజేపీ నేతలు బోగవిల్లి వెంకటరామారావు, రాయుడుప్రవీణ్, చిత్తూరుప్రసాదరావు, గాంధీ, కె.వేణు, ఎం.కళ్యాణ్, జే.సురేష్, కండేల సురేష్‌లు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని విజయోత్సవాలు నిర్వహించారు. ఎన్‌డీఏ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈతతో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న క్లబ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి

పెదపూడి: ఈత ద్వారా చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జి.మామిడాడ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని ఫ్యామిలి హెల్త్ క్లబ్ ఆవరణలో చిన్నారులకు గత నెల 1న ప్రారంభించిన ఈత శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ తీసుకున్న చిన్నారులను ఆరు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. శిబిరంలో హైదరాబాద్‌లోని ప్రఖ్యాత హెల్త్‌క్లబ్‌లో పనిచేసిన సతీష్ చిన్నారులకు ఈతలో శిక్షణనిచ్చారు. మొత్తం 130 చిన్నారులు శిబిరంలో శిక్షణ పొందారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డి.బ్రహ్మానందరెడ్డి, కోశాధికారి గంగాధర్‌రెడ్డి, సబ్బెళ్ల అప్పారెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, అచ్చిబాబు, పప్పు శ్రీను, భాస్కరరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడులను న్యాయపరంగా ఎదుర్కొందాం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



బిక్కవోలు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: అధికార పార్టీ నుంచి ఎదురవుతున్న దాడులను న్యాయపరంగా ఎదుర్కొందామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం బిక్కవోలు గ్రామంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ దాడులకు సంబంధించి న్యాయవాదులకు చెల్లించాల్సిన ఫీజులు తానే చెల్లిస్తానన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఏ మాత్రం భయపడకుండా సంఘటితంగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పారు. గ్రామాల్లో అధికార పార్టీ ఆగడాలపై స్థానిక నాయకులు తక్షణం స్పందించి వెంటనే తనకు తెలియజేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు తాను తోడుంటానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్ సరెళ్ల సుమలత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అలరించిన వేసవి విజ్ఞాన శిబిరాలు

ఆడుతూ పాడుతూ నైపుణ్యాలు పెంచుకున్న విద్యార్థులు



కొంకుదురు శాఖా గ్రంథాలయంలో న్యూస్ పేపర్ చదువుతున్న విద్యార్థులు



వేసవి శిక్షణ శిబిరంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

బిక్కవోలు: తరగతులు, హోం వర్కులతో క్షణం తీరిక లేకుండా గడిపే చిన్నారులు వేసవి వచ్చిందంటే చాలు ఆటపాటలతో సరదాగా గడిపేస్తారు. అయితే ఈ ఏడాది విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాల్లో చేరి తమకు ఇష్టమైన చిత్రలేఖనం, గణితం, పేపర్ క్రాఫ్ట్, పుస్తక పఠనం, యోగా తదితర విభాగాల్లో శిక్షణ పొంది నైపుణ్యాలను పెంచుకున్నారు. విద్యార్థులంతా వేసవిలో సమయాన్ని వృథా చేసుకోకుండా ఆసక్తి ఉన్న అంశాలపై పట్టు పెంచుకోవడం శుభ పరిణామమని విద్యావేత్తలు చెబుతున్నారు.

నియోజకవర్గంలోని గ్రంథాలయాల్లో గత నెల 15 తేదీ నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలను ఏర్పాటు చేశారు. 21 రోజుల పాటు కొనసాగిన ఈ శిబిరాలు ఈ నెల 4వ తేదీన ముగిశాయి. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులంతా వేసవి శిక్షణ శిబిరాలకు హాజరై తమకు ఇష్టమైన విభాగాల్లో శిక్షణ పొందారు. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విశాఖపట్టణం తదితర దూర ప్రాంతాల నుంచి అమ్మమ్మలు, నాన్నమ్మల ఇళ్లకు వచ్చిన చిన్నారులంతా శిబిరాలకు హాజరయ్యారు. వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్ ప్రపంచంలో మునిగిపోకుండా శిక్షణ శిబిరాల్లో పాల్గొనడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాలంటే భలే ఇష్టం



నాకు పుస్తకాలు అంటే చాలా ఇష్టం. అందులోనూ కథల పుస్తకాలు చదివి దాంట్లో ఉన్న నీతిని తెలుసుకోవడమంటే ఎంతో ఆసక్తి. అలాగే పుస్తకాల వల్ల ప్రపంచ దేశాలు, భారత దేశ చరిత్రపై కొంత అవగాహన వచ్చింది. వేసవి విజ్ఞాన శిబిరాల వల్ల పుస్తక పఠనం గురించి ఎన్నో విషయం తెలిశాయి.

– ఎం.మేఘన, విద్యార్థిని, కొంకుదురు

యోగా నేర్చుకున్నాను



వేసవి శిక్షణ శిబిరం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన క్యాంప్ ద్వారా యోగా నేర్చుకున్నాను. మ్యాథ్స్ సులువుగా ఎలా చేయాలో నేర్పించారు. నేను సెలవును సద్వినియోగం చేసుకున్నాను. ఈ అనుభవాన్ని మరిచిపోలేను.

– జి.భరత్, విద్యార్థి, కొంకుదురు

జీకేపై అవగాహన వచ్చింది



రోజూ పేపర్లు చదవడం వల్ల జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన వచ్చింది. చదువుతో పాటు జీకే అవసరాన్ని గుర్తించాను. ఈ క్యాంప్ వల్ల పుస్తకాలు, పేపర్ చదవడంపై ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం రోజూ పేపరు చదువుతున్నాను.

– ఎస్.వీర శంకర్, విద్యార్థి, కొంకుదురు

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగం. బాలలతో విజ్ఞానాన్ని సముపార్జించే చందమామ, బాలమిత్ర వంటి కథలు చదివించాం. వాటిలోని నీతి అర్థం చేసుకుంటే చిన్నారుల నడవడిక బాగుంటుంది. అందుకే మా గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు కథలను బోధించాం.

– నందికోళ్ల బాల, శాఖా గ్రంథాలయాధికారి, కొంకుదురు

సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా

రంగంపేట: సింగంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్టు లంక రాజా శివమణికంఠ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు-2024 ఫలితాల ప్రకారం ప్రభుత్వం మారుతున్నందున తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశానన్నారు. తనతో పాటు మిగిలిన పదవులకు గొల్లపల్లి గోపాలకృష్ణ, కొండేపూడి వీర వెంకట్రావులు రాజీనామా చేశారని చెప్పారు. తమ రాజీనామా పత్రాలను కార్యనిర్వహణాధికారికి అందజేశామన్నారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుల రాజీనామా

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు సొసైటీకి త్రిసభ్య కమిటీ సభ్యులుగా ఉన్న గంగిశెట్టి సోమేశ్వరరావు, చప్పిడి సూర్యచంద్రప్రకాష్, గారబోయిన సత్యనారాయణ తమ పదవులకు రాజీనామాలు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పొందిన ఈ పదవులను ప్రస్తుతం వేరొక ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజా ఓటమిని పొందడంతో రాజీనామాలు చేస్తున్నట్టుగా వారు ప్రకటించారు. రాజీనామా పత్రాలను డివిజనల్ సహకార సంఘం అధికారికి అందజేశారు.